# పలాయితుడు

"కాంతయ్యా!" నడుస్తున్న వాడినల్లా ఆ పిలుపుకుఆగిపోయాను. అడుగులు ముందుకు పడలేదు. వెనక్కి తిరిగేను. ఇద్దరు వ్యక్తులు నన్ను అనుసరిస్తున్నారు. వాళ్ళల్లో ఒకరిని నేనెరుగుదును. అయినా ఎరగనట్టు ముందుకు నడిచాను గబగబా. అయినా ఆ ఇద్దరిలో ఒక వ్యక్తి నన్ను గట్టిగా పిలిచాడు. లేదు నేను వాళ్ళకు దొరక్కూడదు. వేగంగా పరిగెత్తాను. వాళ్లూ నావెనక పరిగెత్తసాగారు. పరుచుకుంటున్న పల్చటి చీకటితెరలు. ఆ చిన్న టౌనులో వాహనాల రాకపోకలు తగ్గాయి. రోడ్డంతా నిర్మానుష్యం. అక్కడక్కడా లీలగా ఎవరిదో సంభాషణ అరుస్తున్న కుక్కలు వెనక్కిచూస్తూ పరుగు తగ్గించి నడవటం ప్రారంభించాను.

'నన్నెలా గుర్తుపట్టినట్టు? ఔను, నా వంపు తిరిగినమీసాలు, బుషల్లా పెంచుకునే గడ్డం వీటిని చూస్తే నన్ను తేలిగ్గా కాంతయ్యగా గుర్తిస్తారు. వెంటనే ఈ రూపం మార్చాలి...' అలా అనుకుంటూ చుట్టూ చూశాను. హెయిర్ కటింగ్ సెలూన్. చుట్టూ అద్దాలు, పెద్ద శబ్దంతో వస్తున్న పాటలు. అమ్మో నా తాహతుకు సరిపోదు.

ఒకప్పుడైతే దర్జాగావెళ్ళేవాడిని. ఇపుడు ఆ పరిస్థితిలేదు. ఇంకొంచెం దూరంలో క్రింద చెక్కపెట్టెతో కూర్చున్న వ్యక్తి కనిపించాడు.

ఔను నాకు సరిపోయే క్షురకర్మకారుడు గబగబా నడిచాను. "తొందరగా నా గెడ్డం, మీసం తియ్యి!" అన్నాను.

అతడు నావంక ఆశ్చర్యంగా చూసి కాసేపు అలా కూర్చో అన్నాడు.

"టైము లేదు... తొందరగా కానియ్యి. లేకపోతే వేరేషాపుకు వెళతాను.." అన్నాను.

వెంటనే చన్నీళ్లతో నా గెడ్డం, మీసం తడిపాడు. కత్తెరతో చకచకా కదులుతున్నాయి అతడి వేళ్ళు రెండు నిమిషాల్లో నా మీసం తీసేసాడు.

గెడ్డం తీయడానికి ఎక్కువ సమయం తీసుకున్నాడు. పావుగంట తర్వాత అద్దం నాముందు పెట్టేడు. నన్ను నేనే నమ్మలేకపోయాను.

ఎవరి ముఖమో నేను తగిలించుకున్నానా అనిపించింది. జేబులోని చిల్లరతీసిచ్చి "అంతకన్నా లేవు. ఇవాల్టికి ఇంతే!" అంటూ కదిలాను.

"బాగానే దొరికిందిబేరం" అనుకుంటూ అతను విసుక్కుంటున్న మాటలు వినబడినా గబగబా ముందుకు నడిచాను నన్ను వెంబడించిన ఆ వ్యక్తులు నా గురించి ఏమి అనుకుంటున్నారో తెలుసుకోవాలనిపించింది, వాళ్ళెక్కడికి వెళ్ళారో అలా ఆలోచిస్తూనే నడుస్తున్నాను.

నేను దోషిని... సంఘందృష్టిలో నేను చేసింది చిన్ననేరం కాదు... అయినా ఏ చట్టము శిక్ష వెయ్యలేని నేరం... నేను నేరం చేసినట్టు ఏవిధమైనటువంటి ఋజువు లేదు... నన్నిప్పుడు వాళ్ళు పట్టుకున్నా ఏమీ చెయ్యలేరు... అయినా వారికి ఎదురు పడడానికి నా మనస్సు ఒప్పుకోవడం లేదు.

దూరంగా టీకొట్టు బయటనించొని టీ తాగుతున్న ఆ ఇద్దరూ కనిపించారు.

ఔను, నా రూపం మారింది, వెంటనే గుర్తుపట్టలేరు. వారికి ఎదురుపడతాను..

అలా అనుకుంటూ క్షణంలో అక్కడకు చేరుకున్నాను.

"ఒక టీ" అంటూ అరిచి తలొంచుకుని వారినే నిశితంగా గమనిస్తున్నాను.

రెండు క్షణాలు భారంగా గడిచాయి.

వాళ్ళిద్దరూ మౌనంగా నుంచుని టీ తాగుతున్నారు. ఇక భరించలేకపోయాను.

"ఇందాక మీరు ఎవరికోసం అలా పరిగెడుతున్నారు" అన్నాను గొంతు మార్చి.

"ఆ విషయం నీకెందుకు?" అన్నాడు ఇద్దరిలో ఒకాయన నావంక అనుమానంగా చూసి.

నేను వెంటనే అన్నాను... "అతను దొంగా?"

"కాదు" అన్నాడు అందులో ఒకాయన.

"మరి హంతకుడా?" ఎదురు ప్రశ్నించాను.

"కాదు" మళ్ళీ ఆయనే అన్నాడు.

"మీ దగ్గర అప్పుతీసుకుని పారిపోయాడా?"

"కాదు..." ఈసారి చిరాగ్గా చెప్పాడు.

నేను వారిని ఈ ప్రశ్నలు వేసినా వారినించి ఏవిధమైన సమాధానమూ లేదు.

అన్నిటికీ కాదు అంటున్నారు.

"అతడి గురించి చెపితే మీకు అతడి ఇల్లు చూపిస్తాను." అన్నాను వెంటనే.

"సరే పద.." అంటూ నా వెనక నడిచారు. నడుస్తూ చెప్పడం ప్రారంభించారు.

ఔను... నా జీవితకథెవరో పరాయివాళ్ళు చెపితే వినే దుర్భర పరిస్థితి.

"కాంతయ్య మా ఊరొచ్చాడు కట్టుబట్టలతో పనికావాలంటూ ఊరంతా తిరిగాడు. ఆఖరికి ఒక కాంట్రాక్టరుగారి దగ్గర పనికి కుదిరేడు. కొద్దిగా చదువుకున్నాడు, అందరితోనూ మంచిగా మాట్లాడేవాడు. ఆ విధంగా కాంట్రాక్టరుగారి అభిమానానికి పాత్రుడయ్యాడు. ఊళ్ళో అందరితో చనువుగా స్నేహంగా మెలిగేవాడు."

"అలా మీ అందరినీ నమ్మించి మీ దగ్గర డబ్బులు తీసుకుని పారిపోయాడా కాంతయ్య..." వారి మాటలు పూర్తికాకుండానే అన్నాను.

"పూర్తిగా చెప్పనియ్యవే...!" అంటూ కోపంగా అరిచాడు చెపుతున్న వ్యక్తి.

"సరే..." అనడంతో మళ్ళీ చెప్పసాగాడు.

"మా ఊళ్ళో ఒక టీ కొట్టు ఉండేది. ఒక విధవరాలు, ఆమె కూతురు దాన్ని నడిపేవారు. ఆ టీకొట్టుఅమ్మాయితో కాంతయ్యకు స్నేహం కలిసింది. కాంట్రాక్టరు ఆ ఇద్దరికీ పెళ్లి జరిపించాడు. సంవత్సరానికల్లా ఒక పాపకు తండ్రిఅయ్యాడు. చెప్పడం ఆపి నావంక సూటిగాచూసి గెడ్డం మీసం తగిలిస్తే అచ్చంనీలావుంటాడు" అన్నాడు. ఆ ఇద్దరిలో నన్ను ఎరిగిన మనిషి.

"ఔను.. నాలా ఉండొచ్చు ఎంతయినా రక్తసంబంధం, వరసకు అన్నయ్య" అనేశాను.

"మీ అన్నయ్యా... అతడిని ఉరితీయాలి ఆ పని చేసినందుకు" అన్నాడు కోపంగా.

నాలో గుండెదడ పెరిగింది.

"ఇదంతా మాకు తెలీదు. మీ ఊళ్లో పనికోసం వచ్చాడనుకున్నాం.. పెళ్లి చేసుకున్నట్టు... ఒక పిల్లకు తండ్రయినట్టు తెలీదు..." అన్నాను.

"జౌను మాయగాడు అందుకే అలాంటి పని చేసాడు" అన్నాడు. ఆవ్యక్తి.

"ఇంతకీ ఏంచేశాడు..." అన్నాను.

ఆ మాటలు నాకే విచిత్రంగా అనిపించాయి. నేనేం చేశానో నాకు తెలియదా!

"ప్రాణానికి ప్రాణంగా ప్రేమించిన భార్యను, రక్తం పంచుకుపుట్టిన కూతుర్ని వదిలిపెట్టి ఒకరోజు ఆ ఊరొదిలి వెళ్ళిపోయాడు..." అన్నాడా వ్యక్తి.

భార్యను, కూతుర్ని వదిలి వెళ్ళిపోయాడంటే బలమైన కారణం ఉంది... అన్నాను.

"ఏమిటీ! అంత ముఖ్య విషయం...? ఏడడుగులు నడిచి నిన్ను ఎన్నటికీ వదలను అని పెళ్ళిలో నాతిచరామి అని చెప్పిన మనిషి భార్యను గాలికొదిలి వెళ్ళిపోవడం న్యాయమా!" అన్నాడు నన్ను ఆ ఊళ్ళో తెల్సిన మనిషి.

"ఎందుకు ఆ పనిచేశాడో... మీకే తెలుస్తుంది రండి నాతో" అన్నాను ముందుకు కదులుతూ. అలా నడుస్తూ నేనుంటున్న మురికివాడలోకి అడుగు పెట్టాను. డ్రెయినేజి పక్కనే గుడిశెలు.

రోడ్డుకు అడ్డంగా తిరుగుతున్న కుక్కపిల్లలు. వాళ్ళిద్దరూ ముక్కు మూసుకున్నారు.

నేనుండేచోటే కాబట్టి నాకలవాటయిపోయింది. గబగబా నాగుడిశె వైపు కదిలాను.

"చక్కటి భార్య ముద్దులొలికే కూతురు, భుక్తిని కల్పించే చిన్న ఉద్యోగంతోపాటూ, ఒక టీ కొట్టు.... ఇంతమంచి జీవితాన్ని వదిలి కాంతయ్య ఈస్లమ్ ఏరియాలో వుండి ఏంచేస్తున్నాడు..." అన్నాడు ఆ ఇద్దరిలో నా కథ చెప్పిన వ్యక్తి.

నేను సమాధానం ఏమీ చెప్పకుండా మౌనంగా ఒక తాటాకు పాకవైపుకెళ్ళి

నుంచుని.

"ఇదే ఇల్లు. తలుపు కొట్టి కాంతయ్యా! అని పిలవండి... నేను లోపలకి రాను, నాకూ కాంతయ్యకు అస్సలు పడదు" అన్నాను.

వాళ్ళిద్దరూ గుడిశె ముందుకు వెళ్ళి నిలబడి "కాంతయ్యా" అని పిలిచారు.

గుడిశెలో చప్పుడు... తలుపు తెరుచుకుంది. అమ్మ బయటకు వచ్చింది.

"కాంతయ్య లేడు బాబూ, బైటకెళ్ళి చాలాసేపయింది. వచ్చేస్తాడు. ఆ అరుగుమీద కూర్చోండి" అని అమ్మ తలుపేసుకుని వెళ్ళిపోయింది.

"ఆవిడను చూశారు కదా..." అన్నాను.

"ఔను, ముగ్గుబుట్టలాంటి తల, ముడుతలు తేలిన దేహం... శ్రీశ్రీ భిక్షువర్షీయసి గుర్తుకొచ్చింది" నన్ను ఆ ఊళ్ళో తెలిసిన వ్యక్తి అన్నాడు.

"ఇంకేం గమనించేరు?" అన్నాను.

"కళ్ళు కనబడడం లేదు కాబోలు తడుముకుంటూ వచ్చి తలుపుతీసింది.... పైగా ఒక కాలులేదు అవిటి బతుకు... పాపం అంధురాలు..." అన్నాడు సానుభూతిగా అందులో ఒకాయన.

"అటువంటి తల్లిని ఒంటరిగా వదిలిపెట్టివెళ్ళిపోవడం న్యాయమేనంటారా...?" అన్నాను.

"అసలు ఇంతకీ ఏం జరిగింది..?" ఉత్కంఠగా అన్నారు ఆ ఇద్దరూ ఒకేసారి.

నేను నా కథ చెప్పడం ప్రారంభించాను.

"మా ఊళ్ళో బతకలేక పనికోసం మీ ఊరొచ్చాడు కాంతయ్యా... అక్కడ ఆశ్రయం పెళ్ళి సంసారం. తన సుఖం చూసుకున్నాడు. తల్లిని మరిచిపోయాడు.

సంవత్సరం తర్వాత తల్లిమీదకు మనస్సు మళ్ళింది. ఇక్కడ అనాథలా బతుకుతోంది. అడుక్కుని పొట్ట నింపుకుంటోందని తెలిసింది. కళ్ళు కనబడక చీకట్లో ఎక్కడో పడింది. కాంతయ్య వచ్చేసరికి చక్కెరవ్యాధి అతడి తల్లి కాలుని పూర్తిగా తినేసింది. కాలు తీసేసారు ధర్మాసుపత్రిలో అవిటి బతుకు. అందులోనూ అంధురాలు కడవరకూ కన్నతల్లిని చూసుకోవాలి. అందుకే భార్యను, కూతురిని అక్కడే వదిలి వచ్చేశాడేమో... వారిని ఇక్కడకు... తల్లిని అక్కడకు తీసుకెళ్ళే పరిస్థితి కాదు. అందుకేనేమో పెళ్ళయిందని మాకెవరికీ మాటవరసకైనా చెప్పలేదు.." అని చెప్పడం ఆపి ఆ ఇద్దరివంక చూశాను.

నేను చెప్పింది అంతా విన్న తరువాత అంత వరకూ కాంతయ్య అంటే కోపంగా ఊగిపోయిన వ్యక్తి ముఖం ప్రసన్నంగా మారింది.

"తొమ్మిది నెలల మోసి, ముప్పయ్యేళ్లు పెంచిన తల్లి రెండేళ్లసహవాసంతో జీవితాన్నిపంచి అతడికో బిడ్డను ప్రసాదించిన భార్య... ఒకరికి దగ్గరై ఇంకోకరికి దూరమై అతడు చేసింది న్యాయమేనా.." అతను నెమ్మదిగా అన్నాడు.

ఆ మాటలు వింటూ నేను ఇక ఉండలేక అక్కణ్ణించి వేగంగా కదిలాను. వాళ్ళిద్దరూ మెల్లగా ఆ చీకట్లో అక్కణ్ణించి నిష్క్రమించారు.

* * * * *

నా భార్యా పిల్లల్ని చూడాలనిపించింది. వారు చెప్పిన మాటలతో నా మనసు వికలమైంది. దూరం నించైనా చూసొచ్చేస్తే చాలనిపించింది.

వెంటనే ఆ ఊరుకు ప్రయాణమయ్యాను.

నా ఆకారంచూస్తే ఎవరూ గుర్తుపట్టలేరు. ఆ ధైర్యంతోనే బయలు దేరాను.

బస్సుదిగి ఆందోళనగా గుడిశె వైపు అడుగు లేసాను. వెళ్ళేసరికి నా ఇంటికి తాళం వేసుంది.

ఇంటి పక్కన ఒక ముసలాయన కూర్చుని తాపీగా చుట్ట కాలుస్తున్నాడు.

"బాబూ.. ఈ ఇంట్లో వాళ్ళేరి...?" అన్నాను.

"సుబ్బయ్యగారి భార్య చనిపోయింది, వాయనం ఇవ్వడానికి పిలిస్తే వెళ్ళింది..." అన్నాడు.

నా గుండెలోబాధ... ఇలాంటి వాయనాలు ఎవరు పుచ్చుకుంటారు. నా భార్యలాంటి అభాగినులు తప్ప కళ్ళల్లో నీరు తుడుచుకుంటూ సుబ్బయ్యగారింటికి బయలుదేరాను. సుబ్బయ్యగారి ఇంటికి ఎదురుగా ఎవరికీ కనబడకుండా నించున్నాను. నా భార్యకోసం నా కళ్ళు వెతుకుతున్నాయి. సుబ్బయ్యగారొచ్చి మౌనంగా ఆ ఇంటి అరుగు మీద కూర్చున్నారు. ఇంట్లో బంధువుల హడావుడి.

సుబ్బయ్యగారి చెల్లెలు చేటలో జాకెట్టు, పసుపు కుంకుమలతో లోపలినించి బైటకొచ్చింది. ఇంతలో ఒకామెవచ్చి ఆవిడ ఎదురుగా నిలుచుంది. ఆమెను చూసేసరికి నాలో భాద ఎక్కువయింది.

సన్నగా పొట్టిగా.. పాత చీర... కళ్ళలో దిగులు మేఘాలు. ఆమె నాతో ఏడడుగులు నడిచిన నా భార్య. నేను మరింత ముందుకొచ్చి నిలుచున్నాను.

"ఎవరీ అమ్మాయి?" అన్నాడు సుబ్బయ్య.

"ఆవిడ కాంతయ్య భార్య.. ఈ అమ్మాయిని వదిలిపెట్టి పారిపోయాడు కదా..." అందామె.

ఆ మాటలకు నా మనస్సు చివుక్కుమంది.

"మొగుడొదిలి పారిపోయినా నిత్య సుమంగళిలా ఉంటుంది. మెడలో పసుపుతాడు, చేతికి గాజులు తలలో పువ్వులు.. నిత్య సువాసిని" అందామె.

మళ్ళీ తన మాటలు పొడిగిస్తూ... ఆమె మాటలు వినగానే నామనసులో

బాధ సుళ్ళు తిరుగుతోంది.

"భర్తలు వదిలేసిన ఆడవాళ్ళే ఇలా ముత్తైదువు చనిపోతే ఇచ్చే వాయనాలకు వెళుతుంటారు. భర్త బ్రతికుండీ తమకు దూరంగా ఎక్కడోవున్నా తిరిగొస్తాడనే భ్రమలో ఉన్నవాళ్ళే ఈ విధంగా వాయనాలు పుచ్చుకుంటారు..." అంది ఒకావిడ.

ఇంకెవరో, నాభార్యగురించి చెపుతున్నమాటలు వినలేక అక్కణ్ణించి వచ్చాను. నాలో సుళ్ళు తిరుగుతున్న బాద నా భార్యవంక చూశాను.

మెడలో పసుపుతాడు, చేతికి గాజులు, ఉదయించే సూర్యుడిలా ఆమె నుదుటిమీద బొట్టు.

నేనెప్పటికైనా తిరిగొస్తాననే ఆశతో ఆమె ఉంది.

ఔను, వచ్చేస్తాను...ఎప్పుడో తెలీదు... నా తల్లి తదనంతరం... ఆమెను కడవరకూ సాకి, అంతే!

'పసుపుతాడుతో ముడిపడిన నా భార్యతోటి బంధాన్ని తెంచేసుకుని, తల్లిపేగుతో కట్టేసుకుని పలాయితుడిగా పేరు తెచ్చుకున్న నాలో క్షణం.. క్షణం అంతర్మధనం.

నా భార్య పక్కనే నా రెండేళ్ల కూతురు. ఒక్కసారి నా కూతుర్ని ఎత్తుకోవాలనిపించింది.

ఆ కోర్కెను బలవంతంగా అణచుకున్నాను. ఇంకొంచెంసేపు అక్కడుంటే నా తల్లిని ఒదిలేసి ఇక్కడే స్థిరపడిపోతానేమో... వెనక్కి తిరిగి చూడకుండా అక్కణ్ణించి కదిలాను.

*– స్వాతి మాసపత్రిక, జూన్ 2006.*

* * * * *